Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 100 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 22 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## తిరుమలశెట్టి లక్ష్మి నాయుడు కుటుంబానికి పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

### - రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి



**అమరావతి, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం దార్కానిపాడు గ్రామంలో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబానికి ప్రభుత్వం పరిహారం ప్రకటించినట్లు రాష్ట్ర హెూం & విప్తత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణతో కలసి ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ సమగ్ర దర్యాప్తుకు ఆదేశించడం జరిగిందన్నారు. ఇదే విషయంపై నేడు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి సమగ్రంగా చర్చించి బాదిత కుటుంబానికి పరిహారాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ ఘటనలో మరణించిన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు భార్యకు 2 ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదు పరిహారాన్ని ప్రకటించారన్నారు. వారి ఇద్దరు పిల్లలకు 2 ఎకరాల చొప్పున భూమి, రూ.5 లక్షల చొప్పున ఫిక్సుడ్ డిపాటిజ్ చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. ఆ ఇద్దరు పిల్లలను చదివించే బాధ్యతను కూడా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ పవన్, భార్గవ్‌లకు కూడా ప్రభుత్వం పరిహారం ప్రకటించడం జరిగిందని ఆమె తెలిపారు. మృతుని సొంత తమ్ముడైన పవన్‌కు 4 ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదుతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని ఆమె తెలిపారు. అదే విధంగా భార్గవ్‌కు రూ.3 లక్షల నగదు, ఆసుపత్రి ఖర్చులు చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఈ హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని, విచారణ వేగవంతంగా జరిగేందుకై ప్రత్యేక పీపీని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఈ హత్యకు కారణమైన నిందితునికి ఎట్టి పరిస్థితిల్లోనూ బెయిల్ రాకుండా చూడాలని, కఠినంగా శిక్షించేందుకు సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాదికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు ఆమె తెలిపారు. ఈ సంఘటనను రాష్ట్ర ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణిస్తూ వెంటనే రాష్ట్ర స్థాయి కమిటినీ ఏర్పాటు చేయడం జరిగిందని, అందుతో తాను, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా.పి.నారాయణ, తాడేపల్లి గూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మరియు కందుకూరి శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సభ్యులగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కమిటీ సభ్యులు హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి, ప్రభుత్వ పక్షాన పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఘటనకు కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరుగుతుందని భరోసా ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు కాకర్ల హరిశ్చంద్ర ప్రసాద్ తన వాహనంతో తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు, పవన్, భార్గవ్‌లు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను రాళ్లపాడు సమీపంలో ఢీకొట్టడం జరిగిందన్నారు. ఈ ఘటనలో లక్ష్మీ నాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, పవన్, భార్గవ్‌లు తీవ్రమైన గాయాలు పాలవ్వడం జరిగిందన్నారు. బాదితుని సొంత తమ్ముడైన పవన్ వెన్నుపూస పూర్తిగా దెబ్బతిందని, నడవలేని స్థితిలో ఉన్నాడని ఆమె తెలిపారు. హరిశ్చంద్ర ప్రసాద్, లక్ష్మీ నాయుడు మద్య ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన తేడాల నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాల మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కుందుకూరు శాసన సభ్యుల ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## నేటి నుంచి 3 రోజుల పాటు యూఏఈలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం యూఏఈ లో ముఖ్యమంత్రి బృందం పర్యటన. వచ్చే నెల 14-15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించనున్న చంద్రబాబు. మూడు రోజుల పర్యటన కోసం రేపు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లనున్న సిఎం చంద్రబాబు. 3 రోజుల్లో వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో ఒన్ టూ ఒన్ మీటింగులకు హాజరు కానున్న ముఖ్యమంత్రి. పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోను భేటీలు. రేపు దుబాయ్‌లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం చంద్రబాబు దుబాయ్‌లో మూడవ రోజు ఏపి ఎన్ఆర్‌టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొననున్న సిఎం చంద్రబాబు. తొలి రోజు పర్యటనలో భాగంగా 22వ తేదీ ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రేపు సీఎం చంద్రబాబు సమావేశం. ఇండస్ట్రీయల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు-షిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చించనున్న చంద్రబాబు. పర్యటనలో పలు ప్రాంతాలను సందర్శించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం. చంద్రబాబుతో పాటు దుబాయ్ పర్యటనలో పాల్గొననున్న మంత్రులు టిజి భరత్, బిసి జనార్ధన్ రెడ్డి, సిఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఎపి ఇడిబి సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి. నవంబర్‌లో నిర్వహించే విశాఖ పార్టనర్షిప్ సమ్మిట్ ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు ఇప్పటికే సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సిఎం చంద్రబాబు, నారా లోకేష్ రోడ్ షోలు.

## న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

### - విశాఖ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ప్రతినిధి బృందాన్ని పంపాల్సిందిగా ఆహ్వానం





**ఆస్ట్రేలియా (సిడ్నీ):** న్యూ సౌత్ వేల్స్ ప్రీమియర్ క్రిస్ మిన్స్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టార్టప్‌లు, గ్రీన్ టెక్నాలజీలలో సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ - న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ & ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఇన్నోవేషన్, వాణిజ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో న్యూ సౌత్ వేల్స్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఒప్పందాన్ని సులభతరం చేయండి. న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ క్లస్టర్లను ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఇన్నోవేషన్ & స్టార్టప్ హబ్‌లతో (విశాఖపట్నం, అమరావతి, అనంతపురం) అనుసంధానించే ఎక్స్చేంజి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వండి. రెన్యూవబుల్ ఎనర్జీ, మెడిటెక్, అగ్రిటెక్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్న న్యూ సౌత్ వేల్స్ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమ కారిడార్లలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సాహించండి. క్లీన్ టెక్, కృత్రిమ మేధస్సు, సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో పరిశోధన & అభివృద్ధి కోసం న్యూ సౌత్ వేల్స్ విశ్వవిద్యాలయాలు, ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల మధ్య సహకారానికి ప్రోత్సహం అందించండి. విశాఖపట్నంలో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ - 2025కి న్యూ సౌత్ వేల్స్ మంత్రి నేతృత్వంలో వ్యాపార ప్రతినిధి బృందాన్ని ఆంధ్రప్రదేశ్ కు పంపించండి. ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డును న్యూ సౌత్ వేల్స్ ఆసియా-పసిఫిక్ వాణిజ్య కార్యక్రమాల్లో చేర్చేందుకు సహకారం అందించండి. న్యూ సౌత్ వేల్స్ ఇన్నోవేషన్ ఏజెన్సీలు, ఆంధ్రప్రదేశ్‌లోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ద్వారా సంయుక్త ఇంక్యుబేషన్ కార్యక్రమాలను అన్వేషించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో ఎన్ఎస్ డబ్లు ఇన్నొవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి అనౌలాక్ చాంథివోంగ్ కూడా పాల్గొన్నారు.

## భీమవరం డిఎస్పీ జయసూర్య వ్యవహారాలపై పశ్చిమ గోదావరి ఎస్పీతో చర్చించిన ఉప ముఖ్యమంత్రి



**అమరావతి, (రాజధాని వార్తలు):** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డి.ఎస్.పి. శ్రీ జయసూర్య వ్యవహారాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. భీమవరం డి.ఎస్.పి. పరిధిలో పేకాట శిబిరాలు పెరిగిపోయాయనీ, సివిల్ వివాదాలలో సదరు అధికారి జోక్యం చేసుకొంటున్నారనీ, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నారనే తరహా ఫిర్యాదులు ఉప ముఖ్యమంత్రి దృష్టికి వచ్చాయి. మంగళవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో ఈ అంశంపై ఉప ముఖమంత్రి పవన్ కల్యాణ్ ఫోన్‌లో మాట్లాడారు. తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులు ప్రస్తావించి డి.ఎస్.పి. వ్యవహార శైలిపై నివేదిక పంపించాలని స్పష్టం చేశారు. అసాంఘిక వ్యవహారాలకు డి.ఎస్.పి. స్థాయి అధికారి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలని, పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలన్నారు. ఈ తరహా వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియచేయాలన్నారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతిభద్రతలను పరిరక్షించాలని దిశానిర్దేశం చేశారు. భీమవరం డి.ఎస్.పి.పై వచ్చిన ఆరోపణలను రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రికీ, రాష్ట్ర డీజీపీకి తెలియచేయాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.



యంయల్ఎ, యం యల్సి నివాస సముదాయ భవనాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలం సీడ్ యాక్సిస్ రోడ్ E3, N 11 జంక్షన్ ప్రాంతం రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామం దగ్గర నిర్మాణం జరుగుతోంది. ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్

## పేకాట శిబిరాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు

### - డీజీపీని నివేదిక కోరిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ లో జూదం ఆడటం, జూద కేంద్రాలు నిర్వహించడం, ప్రోత్సహించడం నేరం. ఆన్లైన్ లేదా ఆఫ్ లైన్‌లో వీటిని నిర్వహించినా, ఆడినా ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ - 1974 ప్రకారం శిక్షార్హులు అవుతారు అని చట్టం చెబుతోంది. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా జూద కేంద్రాలు సాగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. పేకాట క్లబ్బుల నిర్వహణపై ఆ ఫిర్యాదుల్లో తెలిపారు. కొందరు పెద్దలు పేకాట కేంద్రాలను నిర్వహిస్తూ, నెలవారి మామూళ్లను అధికారులకు అందజేస్తున్నారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై నిజానిజాలు తెలుసుకునేందుకు, పోలీసు అధికారులకు దీనిపై ఉన్న సమాచారం తెలుసుకునేందుకు ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దీనిపై ఆరా తీశారు. ఒకవేళ పోలీసు అధికారుల దృష్టికి వచ్చిన వివరాలు, దానిపై తీసుకున్న చర్యలను నివేదిక రూపంలో తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు రాష్ట్ర డీజీపీకి స్పష్టం చేశారు.

# శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ పునః నిర్మాణం చారిత్రాత్మకం

**- భక్తుల మనోభావాలకు అనుగుణంగా గుడి నిర్మాణం - మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి పొంగూరు నారాయణ సహకారంతో**

**ఆలయానికి పూర్వ వైభవం - దళితులకు ప్రవేశం కల్పించిన తొలి ఆలయం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం : వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పునర్నిర్మాణం భక్తుల మనోభావాలకు అనుగుణంగా జరుగుతుందని, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నేతృత్వంలో ఆలయానికి పూర్వ వైభవం చేకూరేందుకు కృషి చేస్తామని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని స్థానిక మూలాపేట నందుగల శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ అధికారులు, స్థపతి, స్థానిక భక్తులు పలువురు తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు తో పాటు వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేమిరెడ్డికి తీర్థ ప్రసాదాలతో పాటు వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం దేవాదాయ శాఖ అధికారులు ఆలయ నిర్మాణంకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాల పునరుద్ధరణలో భాగంగా శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయాన్ని పునర్నిర్మించేందుకు రాష్ట్ర మంత్రులు సంకల్పించడం జరిగిం దన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోద ముద్ర వేశారన్నారు. ఎంతోకాలంగా ఆనం కుటుంబం ఆలయానికి ట్రస్టీగా కొనసాగుతున్నారని, వారి హయాంలో ఆలయం ఎంతో అభివృద్ధి చెంది స్వామివారి ఆస్తులు గణనీయంగా పెరిగాయి అన్నారు. ఈ క్రమంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఆలయ పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడం విశేషకరమన్నారు. దేవాదాయ శాఖ అధికారులు అందుకు సంబంధించిన నిర్మాణ నమూనాను సిద్ధం చేశారన్నారు. దేవాదాయ శాఖ స్తపతులు, ఆలయ అర్చకులు, స్వామివారి భక్తులతో సంప్రదించి వారి సూచనలు సలహాలు మేరకు నిర్మాణ పనులు చేపట్టనున్నమన్నారు. గతంలో ఆలయం నిర్మాణం సమయంలో యమ బాధలు ఉండకూడదన్న ఉద్దేశంతో దక్షిణ భాగంలో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందనీ, స్వామి వారి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగేందుకు అనుకూలంగా నిర్మాణం చేపట్టారన్నారు. మొట్టమొదటిసారిగా దళితులకు ఆలయ ప్రవేశ కల్పించిన దేవస్థానం ఏదైనా ఉందంటే అది శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం మాత్రమే అన్నారు. అప్పట్లోనే ఆలయ ప్రాంగణంలో నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. ఇప్పటివరకు దేవస్థానం ఆస్తులను కాపాడుకుంటూ వచ్చింది ఆనం కుటుంబమేనన్నారు.





ఆలయ నిర్మాణం కోసం త్రిదండి పీఠాధిపతి శ్రీ చిన్న జీయర్ స్వామి వారిని సంప్రదించి నిర్మాణా నికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రజలందరికీ మంచి జరిగేలా గుడి పునర్నిర్మాణం జరుగుతుందని దేవాదాయ శాఖ ఆనం రామనారాయణరెడ్డి మంత్రి తనతో చెప్పడం జరిగింద న్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్క రిస్తామని వేమిరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం పలువురు స్థానిక భక్తులు తమ సమస్యలను వేమిరెడ్డికి వివరించారు సానుకూలంగా స్పందించిన ఆయన నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆర్ జె సి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, రాష్ట్ర దేవాదాయ శాఖ స్థపతి పి పరమేశ్వరప్ప, కర్నూలు సూపరింటెంట్ ఇంజనీర్ ఎస్ సతీష్, గుంటూరు డివిజనల్ ఇంజనీరు సిహెచ్ శ్రీనివాసులు నెల్లూరు ఏఈ మురళీమోహన్ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# వి ఎస్ యూ లో 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర'

**- పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం ఎస్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో "స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయాన్ని హరితవనంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు మొక్కల్ని నాటుతూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పర్యావరణ సమతుల్యతలో మొక్కల పాత్ర అత్యంత కీలకం. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. "స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థుల అభ్యసనానికి అనుకూలం. అందుకే విశ్వవిద్యాలయాన్ని హరితవనంగా తీర్చిదిద్దడంలో మనం అందరం భాగస్వాములుగా నిలవాలి" అని చెప్పారు. అంతేకాకుండా దేశాన్ని కలుష్యరహితంగా నిలుపడంలో ప్రజలు సృజనాత్మకంగా ముందుకు రావాలని, పర్యావరణ పరిరక్షణ ఓ సామూహిక బాధ్యతగా భావించాలని సూచించారు.

కార్యక్రమం ముగింపులో అందరూ కలిసి పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ప్రతిజ్ఞ చేశారు. 2047 నాటికి 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, ఎస్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయశంకర్ అల్లం, ఆచార్య టి. వీరారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కండి : కమిషనర్ వై.ఓ నందన్




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పర్యావరణహితం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పది ప్రాంతాల్లో పర్యావరణహిత అవగాహన సైకిల్ ర్యాలీలు, మొక్కలు నాటే కార్యక్రమాలను శనివారం చేపట్టారు. అందులో భాగంగా స్థానిక ఎస్పీ బంగ్లా నుంచి బట్వాడి పాలెం కూడలి వరకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నేతృత్వంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాలు కమిషనర్ పాల్గొని మొక్కలను నాటి సంరక్షించే చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా "క్లీన్ ఎయిర్" అంశంపై కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. వాతావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రకృతికి స్వచ్ఛమైన వాయువులను అందించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకొని కర్బన ఉద్గారాలను తగ్గించే దిశగా పాటుపడాలని సూచించారు. కాలుష్యాన్ని పెంపొందించే పెట్రోల్, డీజిల్ ఆధారిత వాహనాలకు ప్రత్యామ్నాయంగా సైకిల్, ఎలక్ట్రిక్ బైకులు, ఎలక్ట్రిక్ కారుల వాడకాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. వీలున్నంతలో ప్రతి ఒక్కరు స్వచ్ఛమైన వాయువులను అందించే పర్యావరణహితమైన మొక్కలను నాటి, వాటిని సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని కమిషనర్ వివరించారు. వర్షాకాలం నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు నివాసం ఉండటం ప్రమాదకరమని, స్థానిక రెవెన్యూ అధికారులకు, లేదా వార్డు సచివాలయాలలో సమాచారం అందిస్తే వారికి తాత్కాలిక పునరావాస ఏర్పాట్లను కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా అగ్ని ప్రమాదాల సంభవించే మందుగుండు సామాగ్రితో కూడిన టపాసులను ఇళ్లలో నిల్వ ఉంచడం ప్రమాదకరమని, బాణాసంచా కాల్చే సమయంలో ప్రజలంతా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి డ్రైను కాలువలలో అడ్డంకులు ఏర్పడకుండా శానిటేషన్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షాలకు సంబంధించి ఎలాంటి సహాయం పొందాలన్నా కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్ 94940 18118 కు వాట్సాప్ ద్వారా లేదా ఫోన్ కాల్ ద్వారా సమాచారాన్ని అందజేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, అన్ని విభాగాల అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ హిత కార్యక్రమంలో భాగంగా చెట్లు నాటిన 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇంతియాజ్ మరియు 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ పాల్గొని స్వయంగా చెట్లు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరు తమ పరిసరాల్లో చెట్లు నాటాలని, వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు శుభ వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం కింద పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇలాంటి చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కోటపాటి రాజా, సెక్రెటరీ దువ్వూరు నరేంద్ర, బిఎల్‌సి ఆర్కాట్ శీను,పిల్ల ప్రసాద్, మేడా శీను, గిరి, వెంకటేశ్వర్లు, మహంకాళి సురేంద్ర, జహూర్ అహ్మద్, చంద్ర, మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ సిబ్బంది స్థానిక ప్రజలు, మరియు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.





# సీఎం చంద్రబాబుతో సచివాలయంలో భేటీ అయిన హోం మంత్రి అనిత, అధికారులు సురేష్, ఆకే రవికృష్ణ

**అమరావతి, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బాణసంచా పేలుడు ఘటనపై నివేదికను సీఎంకు అందించిన అధికారులు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని సీఎం ఆదేశం. ఒకే షెడ్డులో ఒకే చోట 14 మంది కార్మికులు మెటిరీయల్ మాన్యుఫాక్చరింగ్ చేశారని నివేదికలో వెల్లడి. హార్డ్ మెటీరియల్ వాడటం వల్లే స్పార్క్ వచ్చి, మాన్యుఫాక్చరింగ్ జరుగుతున్న ప్రాంతంపై పడిందని పేర్కొన్న అధికారులు. ఏమాత్రం నిబంధనలు పాటించలేదని నివేదికలో వెల్లడి. పేలుడు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం అందించాలని సీఎం ఆదేశం. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందించాలని ఆదేశం. లైసెన్సు ఇచ్చే ముందు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనేది అధికారులు తనిఖీలు నిరంతరం చేయాలని సూచించిన సీఎం. తయారీ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం. ఎక్స్ ప్లోజివ్ మెటీరియల్ పై నియంత్రణ కోసం ఇక నుంచి ఆన్ లైన్ ద్వారానే కొనుగోళ్లు జరిగేలా చూడాలన్న ముఖ్యమంత్రి. బాణసంచా కోసం ఉపయోగించే పదార్థాల కొనుగోళ్లు, తయారీపై పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేసిన సీఎం. నిబంధనల ప్రకారం లేని తయారీ కేంద్రాలను, ఆథరైజేషన్ లేని వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని పేర్కొన్న సీఎం. నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించాలని ఆదేశం. బాణసంచా తయారీ కేంద్రాలన్నీ నిబంధనల ప్రకారమే ఉండాలి. పనిచేసే వారికి వ్యక్తిగత భీమా ఉండాలని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు.



# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహాజన టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం












**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా, రాష్ట్ర నాయకులకు ప్రత్యేకంగా ఈ సమావేశానికి హాజరైన ఉద్యమ సీనియర్ నాయకులు గిద్దలూరు ప్రసాద్‌కి అలాగే రత్నంకి మా ఎంటిఏ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. భారీ వర్షం వస్తున్నప్పటికి కమిట్మెంట్‌తో ఈ సమావేశానికి విచ్చేసిన తిరుపతి జిల్లా నాయకులకు అలాగే రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకుమాని జ్యోతి కి ధన్యవాదములు ఈ సందర్భంగా గిద్దలూరు ప్రసాద్ ని ఉద్యమ పరంగా అయన సీనియారిటీని గుర్తించి ఎంటిఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా కార్యవర్గ సభ్యులు ఎన్నుకొని అభినందించడం జరిగింది.

ఈ సమావేశంలో ఎంటిఏ ఆర్థిక నివేదికను పీరయ్య (తిరుపతి జిల్లా) భాస్కర్ (నెల్లూరు జిల్లా) చదివి వినిపించారు.ఇది వారి పని నిబద్ధతను తెలియజేస్తుంది. వారిరువురికి మా ధన్యవాదములు..ఇదే స్ఫూర్తితో ఎంటిఏని మరింత సంఘటితంగా ముందుకు తీసుకెళ్లగలరని ఆశిస్తూ.....రాష్ట్ర కార్యవర్గంలో తీసుకున్న నిర్ణయాలను అందరం తూ. చా తప్పకుండా పాటించి సంఘం అభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాను...ఈ సమావేశానికి తోడ్పాటు అందించిన సీనియర్ నాయకులు పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు అయిన శ్రీనివాసులు అన్నకి మేమెప్పుడూ రుణపడి ఉంటాము...ఈ సమావేశంలో భాగస్వామ్యులైన తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం వెంకటేశ్వర్లు, జడ చలపతికి, ఉపాధ్యక్షులు దొరబాబుకి, నెల్లూరు జిల్లా అధ్యక్షులు రవి ప్రసాద్‌కి, రాజ్ కుమార్‌కి, సీతారామపురం మండల అధ్యక్షులు కలివెల మహేంద్రకి అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్యకి నా హృదయ పూర్వక ధన్యవాదములు తెలుపుతున్నాను.ఉద్యమాభివందనాలతో....మీ..డాక్టర్ మస్తాన్ మాదిగ చేమూరు రాష్ట్ర అధ్యక్షులు మహాజన టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్.

# మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన గిద్దలూరు ప్రసాద్‌కి ప్రత్యేక ధన్యవాదములు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సీనియర్ ఉద్యమం నాయకుడు ఎంఆర్‌పిఎస్‌లో ఎంఇఎఫ్‌లో కీలకంగా పని చేసి టీచర్స్‌కు ఒక సంఘము అంటూ ఉండాలని దృఢ సంకల్పంతో ముందుకు వచ్చి మహాజన టీచర్స్ అసోసియేషన్ పనితీరు నచ్చి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన గిద్దలూరు ప్రసాద్ అన్న చవటుపాలెం గ్రామం నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తి. ఈయన చేరికతో మరింత ఊపందుకున్న మీ అన్న మీకు మరొక సారి ధన్యవాదములు. మీ దూడల పెంచలయ్య.

# సుబ్బానాయుడు హఠాన్మరణంపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దిగ్భ్రాంతి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** టీడీపీ సీనియర్ నాయకులు, ఆప్తులు, పార్టీకి విశేష సేవలు అందించిన ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు ఆకస్మిక మృతి తీరని లోటని, ఆయన హఠాన్మరణనం బాధాకరమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంచి మనిషిగా, తెలుగుదేశం పార్టీ దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి సుబ్బానాయుడు అందించిన సేవలు మరువలేనివని, ఆయన లేని లోటు పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, బాధాకర సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు ఆ దేవుడు ఆత్మధైర్యం ఇవ్వాలని కోరారు.

# పాలేపీటి సుబ్బానాయుడు మృతిపై శ్రద్ధాంజలి ఘటించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

## - "రైతు బాగుండాలి - రాష్ట్రం బాగుంటుంది" అన్న తత్వాన్ని నెరవేర్చిన నేతకు చివరి వీడ్కోలు

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఆగ్రో ఇండస్ట్రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాలేపీటి సుబ్బానాయుడు మృతి పట్ల వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారు మీడియా ద్వారా విడుదల చేసిన ప్రకటనలో "ఒక రైతు కుటుంబం నుంచి వచ్చిన సుబ్బానాయుడు గారు వ్యవసాయ రంగ అభివృద్ధికి తన జీవితం అంకితం చేశారు. పదవిని హోదాగా కాకుండా, సేవా వేదికగా మలచుకున్న నిస్వార్థ నేత ఆయన," అని పేర్కొన్నారు. సుబ్బానాయుడు గారు జీవితం పాఠాలు చెబుతుందనీ, గ్రామీణ యువతకు ఆశగా నిలిచిన ఆయన సేవలు చిరస్థాయిగా ప్రజల మనసుల్లో నిలిచిపోతాయని చెప్పారు. "ఆయన చూపిన నిష్ట, త్యాగం, ప్రజల పట్ల ఉన్న ప్రేమ మాకు చిరకాలం స్ఫూర్తిగా నిలుస్తాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి ప్రగాఢ



సానుభూతి తెలియజేస్తున్నాను," ఇట్లు మీ కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి- శాసనసభ్యులు

# ఈ వెలుగుల దీపావళి పండుగ చీకటిని తరిమేసి సిరిసంపదల వెలుగులు నింపాలని కోరుకుంటూ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకై పవన్ కళ్యాణ్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయంతో వెలుగు చూడని గ్రామాలు సైతం నేడు కాంతులీనుతున్నాయి.
ముఖ్యంగా దీపావళి పండుగ నాడు సత్యభామ స్ఫూర్తిని ముందుకు నడిపిస్తూ జనసేనలో ప్రత్యేక వీర మహిళ విభాగం ప్రోత్సహిస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మహిళా సాధికారతను ముందుకు నడిపిస్తున్నారు. కిషోర్ గునుకుల-జనసేన జనసేన పార్టీ, నెల్లూరు జిల్లా కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు. దీప కాంతులతో శోభాయమానంగా జనసేన పార్టీ,నెల్లూరు జిల్లా కార్యాలయం, గోమతి నగర్‌ను వేములపాటి అజయ్ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో అలంకరించి దీపాకాంతులతో, టపాకాయలు పేల్చి, జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు వేడుకగా దీపావళి పండుగనూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భారతదేశంలో ప్రతి పండగకీ ఒక అర్థం ఉంది. చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటున్నారు. రాజధాని లేక అంధకారంలో మునిగిపోతున్న రాష్ట్ర ప్రజల సంక్షేమం,అభివృద్ధిని కాంక్షించి పవన్ కళ్యాణ్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రజల జీవితాల్లో దీప కాంతులు వెలజిల్లుతూ కూటమి పరిపాలన సాగుతుంది. ఇప్పటికీ వైసీపీ మారీచులు ఏదో ఒక కుట్రలు పన్ని విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారని వారి ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా ప్రజలకు సుభిక్షమైన పరిపాలనందే విధంగా కూటమి నాయకులందరూ వ్యవహరించాలని కోరారు.
ముఖ్యంగా దీపావళి పండుగ నాడు సత్యభామ లోని స్ఫూర్తిని మహిళలందరూ తీసుకుని చెడుపై ధైర్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, రూరల్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,ఐటీ వింగ్ కోఆర్డినేటర్ శివకృష్ణ, జిల్లా కార్యాలయ ఇన్ చార్జ్ జమీర్, సీనియర్ నాయకులు ఏటూరు రవి, కారంపూడి కృష్ణారెడ్డి, సాయి, శ్రీకాంత్, సురేష్, మనోజ్, వర్షన్, సాయి,వీర మహిళలు శాంతిగల, నందిని, కృష్ణవేణి, కస్తూరి జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరద హెచ్చరిక - కోవూరు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - ప్రజల రక్షణకు తగిన చర్యలు తీసుకోండి - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోనులో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**కోవూరు, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమశిల నుంచి వరద వచ్చే ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో పెన్నా తీరం వెంట ఉన్న కోవూరు నియోజకవర్గ ప్రజల రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో ఫోన్లో ఆమె మాట్లాడారు. ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె చర్చించారు. పెన్నా పొర్లుకట్టలు పలుచోట్ల బలహీనంగా ఉన్నాయని, కట్టల వెంట ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వరద ముప్పు నుంచి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు కూడా వరద, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న తరుణంలో లోతట్టు, తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్వోలు, విఆర్వోలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని



కోరారు. తీర ప్రాంతాల్లో గంటకు 45-65 కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, సముద్రంలో ఉన్న మత్స్యకారులు అక్టోబర్ 21 లోపు తీరానికి చేరుకోవాలన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# టిడిపి సీనియర్ నేత మాలెపాటి సుబ్బనాయుడు మృతికి సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తెలుగుదేశం పార్టి రాష్ట ఉపాధ్యక్షులు ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బనాయుడు మృతిపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. కావలి నియోజకవర్గంలో టిడిపి బలోపేతానికి సుబ్బనాయుడు ఎంతో కృషి చేశారన్నారు. నిబద్ధత, అంకితభావం కలిగిన నాయకుడిని కోల్పోయామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. దివంగత సుబ్బనాయుడు కుటుంబ సభ్యులకు ఆమె తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుబ్బానాయుడు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

# సంపాదకీయం

## మారీచ కుట్రలు

విశాఖపట్నం సమీపంలో 1.36 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో గూగుల్ సంస్థ ద్వారా ఏఐ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అని కేంద్రం ప్రకటించింది. మన దేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుసకొడుతున్న వేళ ఆ దేశానికి చెందిన గూగుల్ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అతి పెద్ద డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖకు పెట్టుబడుల వరద ప్రవహిస్తుందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ఇదొక మైలురాయి. భారీ పెట్టుబడి సాధించినందుకు 'ఆహా' అని మురిసిపోవాలి. అయితే పునాదులు కూడా దాటని వైద్య కళాశాలల నిర్మాణాలను చూసి 'ఆహా' అని ఆశ్చర్యపోవాలని చెప్పుకొన్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అండ్ కో మాత్రం విషం కక్కడం మొదలుపెట్టారు. గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ వల్ల పర్యావరణం దెబ్బతింటుందని ఏడుపులు లంకించుకున్నారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పర్యటనలకు వెళ్లినప్పుడు పచ్చని చెట్లను నరికేసినా పర్యావరణం గురించి ఒక్క నోరు కూడా పెగల్లేదు. ఇంతటితో ఆగకుండా ప్రతిపాదిత డేటా సెంటర్‌ను తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నాలు మొదలయ్యాయి. డేటా సెంటర్ అంటే సాదాసీదా గోడౌన్‌లాంటిది అని, కంప్యూటర్లను లోపల పెట్టి బయటి నుంచి తాళాలు వేస్తారని వెకిలి మాటలు మాట్లాడుతున్నారు. జగన్ అండ్ కోలో ఇంత మనోవికారం ఎందుకు ఏర్పడిందో అంతుపట్టదు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారే అయితే తాము అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబును మించి పెట్టుబడులు సాధిస్తామని చెప్పుకోవాలి. అలా కాకుండా పొరుగు రాష్ట్రాలకు ఈర్ష్యగా మారిన ఈ ఒప్పందంపై విషం చిమ్మడం ఏమిటి? దీన్నిబట్టి వారి మెదళ్లు ఎంత విషతుల్యం అయ్యాయో అర్థం చేసుకోవచ్చు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోందని ప్రముఖ అంతర్జాతీయ పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ నెల 11న ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం లండన్ పర్యటనలో ఉన్న జగన్‌రెడ్డికి ఇలాంటి పెద్ద విషయాలు తెలియకపోవచ్చు అంటే అర్థం చేసుకోవచ్చు. ఆయన మద్దతుదారుల్లో అంతో ఇంతో చదువుకున్న వాళ్లు ఉన్నారు. వారికి కూడా తెలియకపోతే ఎలా? రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే చంద్రబాబుకు గానీ, ఐటీ మంత్రి లోకేశ్‌కు గానీ వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉండదు. పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ మహానగరమే ఇందుకు నిదర్శనం. ఆహా అని మెచ్చుకోవాల్సిన సందర్భాలలో కూడా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. గూగుల్‌తో ఒప్పందానికి సంబంధించిన వార్తను జగన్ మీడియా అస్సలు పట్టించుకోలేదు. అంటే సదరు రోత మీడియాకు రాష్ట్ర ప్రయోజనాలు అంత ముఖ్యం కాదు.. జగన్‌రెడ్డి ప్రయోజనాల కోసమే ఆ మీడియా పనిచేస్తోందన్న మాట! ప్రస్తుత పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ ఏఐ హబ్ గేమ్ చేంజర్ అనే చెప్పవచ్చు. అల్ప బుద్ధులు ఉన్న వారికి ఇది అర్థం కాదు. చేపలు, రొయ్యల దుకాణాలు ఏర్పాటు చేయించడమే అభివృద్ధి అని గొప్పలు చెప్పుకొన్న వారికి ఇలాంటి పెద్ద విషయాలు అర్థం కావు. చేపలు, రొయ్యలను తాజాగా కొని తెచ్చుకొని తినవచ్చునని పులివెందుల ప్రజలు ఊహించారా? అని సెలవిచ్చిన జగన్‌రెడ్డి నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేము! ప్రభుత్వం సరఫరా చేసే విషతుల్యమైన మద్యం తాగుతూ చేపలూ రొయ్యలూ వండుకొని నంజుకుతింటూ కునారిల్లుతూ ఉండాలన్నది జగన్ అండ్ కో కోరిక. థింక్ బిగ్.. డ్రీమ్ బిగ్ అని దివంగత అబ్దుల్ కలాం చెప్పేవారు. జగన్ అండ్ కో నుంచి అంత ఆశించలేము. వినూత్న ఆవిష్కరణలు, భారీ పెట్టుబడుల గురించి ఆలోచించకపోయినా ఫర్వాలేదు - రాష్ట్రాభివృద్ధికి జరుగుతున్న ప్రయత్నాలపై మారీచ, సుబాహుల వలె నిప్పులు పోయడం ఏమిటి? సంక్షేమం పేరిట ప్రభుత్వం విసిరే మెతుకులు తింటూ జనం ఎదుగూ బొదుగూ లేని జీవితం గడపాలన్నదే జగన్ అండ్ కో అభిలాష. అధికారంలో ఉన్నప్పుడు ఆ దిశగానే అడుగులు వేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిస్థితిలో మార్పు మొదలైంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరెందరో ఏపీకి రావొచ్చు. ఇదే ఒరవడి కొనసాగితే ప్రజల్లో కూటమికి ఆదరణ పెరుగుతుంది. అదే జరిగితే తమకు రాజకీయంగా నష్టమని భావిస్తున్న జగన్ అండ్ కో కుత్సితపు ఆలోచనలకు తెర తీశారు. కుట్రల అమలు మొదలుపెట్టారు. ఏదో ఒకటి చేసి పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉండకుండా చేయాలన్న ప్రయత్నాలు మొదలయ్యాయి. త్వమేవాహం అంటే త్వమేవాహం అనుకొనేలా కాకుండా జగన్‌రెడ్డికి భిన్నంగా చంద్రబాబు పనిచేయడం ఏమిటి? ఆయన ప్రయత్నాలు ఫలించడం ఏమిటి? కేంద్రం నుంచి సహకారం అందడం ఏమిటి? అని రగిలిపోతున్నారు. 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్టుగా అధికారంలో ఉన్నంత కాలం విషతుల్యమైన మద్యాన్ని ప్రజలకు విక్రయించి మద్యం కొనుగోళ్లలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్ అండ్ కో, ఇప్పుడు కల్తీ మద్యాన్ని తెర మీదకు తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జరుగుతూనే ఉంటాయి. కల్తీ సారా, కల్తీ మద్యం తాగి మన తెలుగునాటే కాదు, ఇతర రాష్ట్రాలలోనూ ఎంతో మంది మరణించిన సంఘటనలను చూశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ, రాష్ట్రం విడిపోయాక గానీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిలో ఒక్క జగన్మోహన్‌రెడ్డి మినహా మరే ముఖ్యమంత్రి కూడా మద్యం ద్వారా సొమ్ములు దండుకొనే ఆలోచన కూడా చేయలేదు.

# వి ఎస్ యూలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రామ్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో కొత్తగా చేరిన విద్యార్థుల కోసం "ఇండక్షన్ ప్రోగ్రామ్" ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వనరులను, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలతో కూడిన నాయకత్వ లక్షణాలను అలవరచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రిజిస్ట్రార్ డా. కె. సునీత ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు విశ్వవిద్యాలయ వాతావరణాన్ని, సదుపాయాలను తెలుసుకుని, సామూహికంగా పనిచేయడం, సామాజిక బాధ్యతలను నేర్చుకోవచ్చని తెలిపారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు, అధిపతులు: ఆచార్య సుజా ఎస్. నాయర్, డా. చెంచురెడ్డి, విభాగాధిపతి డా. జి. సాయి శ్రవంతి మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, విభాగంలో ఉన్న అధ్యాపక వనరులు, పరిశోధన, ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఆత్మవిశ్వాసం, బృందంతో పనిచేసే తత్వం వంటివి కెరీర్ ఎదుగుదలకు దోహదపడతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ: విద్యార్థులు శ్రద్ధ, కృషి, సమయపాలన వంటి లక్షణాలను అలవరచుకుని, కళాశాలలోని వనరులను ఉపయోగించుకుని ప్రతిభావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

# పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### - ఆత్మకూరు నియోజకవర్గానికి 10 వేల సోలార్ యూనిట్లు మంజూరు - విద్యుత్ పొదుపుతో పాటు ఆదాయం కూడా లభిస్తుంది : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పిఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆత్మకూరు పట్టణ ప్రజలందరూ ముందుకు రావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని ఒక ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను మంత్రి స్వయంగా పరిశీ లించి, ఆ ఇంట్లో ఏసీ, టీవీ, గీజర్, ఫ్రిడ్జ్ సోలార్‌తో పనిచేస్తున్న విధానాన్ని యజమానిని అడిగి తెలుసుకున్నారు. తమకు సోలార్ విద్యుత్ వలన ఎంతో ఉపయోగంగా ఉందని, విద్యుత్‌బిల్లు చాలా తగ్గిందని వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేకంగా అమలుచేస్తున్న పిఎం సూర్యఘర్ పథకంతో అనేక ప్రయోజనాలున్నాయన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సుమారు 10వేల పైగా సోలార్ యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. 2 కిలోవాట్లు, 3 కిలోవాట్ల మేరకు సామర్థ్యంతో ప్రతి ఇంట్లో ఈ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

2 కిలోవాట్లకు ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్‌స్టాల్ చేస్తుందన్నారు. ఇతర వర్గాలకు సబ్సిడీతో అందిస్తుందని చెప్పారు. జీఎస్టీ ఐదు శాతానికి తగ్గడంతో పది వేల వరకు తగ్గింపు కూడా వర్తిస్తుందని చెప్పారు. ఇంటికి పోను మిగులు విద్యుత్ ద్వారా కూడా ఆదాయం సమకూరుతుందన్న మంత్రి, ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రజలందరూ సోలార్ వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు.

# కుళ్లిన, నిల్వ చికెన్ విక్రయాలు.. రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు




**విజయవాడ సిటీ, (రాజధాని వార్తలు):** నగరంలోని ప్రజలకు కుళ్లిన, నిల్వ ఉన్న మాంసాన్ని విక్రయిస్తున్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఎన్నో ఏళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ మోసాన్ని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్రదండు ప్రకాష్ నాయుడు పసిగట్టారు. తన సిబ్బంది, మున్సిపల్, పశు సంవర్ధక శాఖ అధికారులతో తనిఖీలు చేసి చికెన్ షాపుల్లో జరుగుతున్న చీటింగ్ బయటపెట్టారు. మొగల్రాజపురం, పటమటలంక ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన ఈ బృందం ఒళ్లు గగుర్పొడిచే అంశాలను మన ముందుకు తీసుకొచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారి రవీంద్రరెడ్డి, మున్సిపల్ వెటర్నరీ డాక్టర్ సోమశేఖరరెడ్డి, మాంసాభివృద్ధి కార్పొరేషన్ అసిస్టెంట్ డైరక్టర్లు డాక్టర్ సుధామాధురి, డాక్టర్ ఎ. వీరప్రసాద్, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలోని ప్రజలు ఎక్కువ మంది సదరు షాపులోనే చికెన్ కొనుగోలు చేస్తుంటారు. పెద్ద సంఖ్యలో ప్రజలకు చికెన్ అమ్మే ఈ షాపు లోపలకు వెళ్లిన ఈ బృందం ఒక్కసారిగా ఖంగుతింది. మాంసం. ప్రాసెస్ చేసే ప్రాంతాలు దుర్భరంగా ఉన్నాయి. వారం రోజుల క్రితం మాంసం ఫ్రిజ్లో ఉంది. 24 గంటల క్రితం చనిపోయిన కోళ్లు ర్యాక్ లోనే ఉన్నాయి. నాలుగు రోజులుగా కోళ్ల వ్యర్థా లను అక్కడ నుంచి బయలకు తీసుకెళ్లలేదు. పైకి అత్యంత ఆకర్షణీయంగా కనిపించే ఈ షాపు లోపల ఉన్న వాతావరణం చూసి ఈ బృందం ఒక్కసారిగా బిత్తరపోయింది. వెంటనే దుకాణంపై కేసు నమోదు చేసింది. నిల్వ ఉన్న మాంసంపై బ్లీచింగ్ చల్లి అక్కడ నుంచి తరలించింది. తరువాత.. పటమటలంక కృష్ణవేణి రోడ్డులోని ఓ దుకాణంలోనూ నిల్వ ఉన్న మాాన్ని ఈ బృందం గుర్తించింది. అక్కడైతే ఏకంగా టాయిలెట్ పక్కనే మాంసాన్ని నిల్వ చేశారు. కొనుగోలుదారులు రాగానే అదే మాంసాన్ని అంటగడుతున్నట్లు ఈ బృందం గుర్తించింది. కోళ్ల వ్యర్థాలు, అపరిశుభ్రంగా ఉన్న ఈ దుకాణంపైనా వారు కేసు నమోదు చేశారు. ఈ షాపు నుంచి అత్యధికంగా హెూటళ్లకు చికెన్ సరఫరా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఈ సంస్థను నెలకొల్పారన్నారు. నాసిరకు మాంసాన్ని విక్రయించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇబ్బందులు తలెత్తకుండా కార్తీక ఏర్పాట్లు ఉండాలి

### - సమీక్ష సమావేశంలో డిసిసిబి చైర్మన్ బాబు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట భీమేశ్వరాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి జరిగే కార్తీక మాస ఉత్సవాల్లో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడాలని డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. స్థానిక భీమేశ్వర ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల ఏర్పాట్లపై తహసీల్దార్ కె చంద్రశేఖర రెడ్డి అధ్యక్షతన పలు శాఖల అధికారులు, భక్త నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్‌ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డిసిసిబి చైర్మన్ బాబు మాట్లాడుతూ హిందూ ప్రజల అత్యంత పవిత్ర మాసమైన కార్తీక మాస పూజలకు దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉన్నందున వారికి స్వామివారి దర్శనం విషయంలో ఇబ్బం దులు కలగకుండా చూడాలన్నారు. ఈ విషయంలో అనుభవం కలిగిన ఆలయ చైర్మన్ కంటే జగదీశ్ ఉన్నందున ఆయన నేత్రత్వంలో కార్తీక ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చెయ్యాలన్నారు. ఇంకా సమావేశంలో భక్త నాయకులు, పట్టణ ప్రముఖులు మాట్లాడుతూ ఆలయం వద్ద క్యూ లైన్‌లు, మంచి నీరు, అన్నదానం, ప్రసాదాల పంపిణీ, స్వామివారి, అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు, వారికి నెలరోజులు పాటు జరిపే పూజాధికాలు, ఆలయ పుష్కరిణిలో భక్తుల పవిత్ర స్నానాలకు ఏర్పాటు, కార్తీక పౌర్ణమి, స్వామివారు, అమ్మవారల తెప్పోత్సవం ఏర్పాట్లు, ఆలయం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు, స్వచ్ఛంద సంస్థల సేవలు, వాలంటీర్ల ఏర్పాటు, తదితర అంశాలపై మాట్లాడి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ ఎ శ్రీవిద్య, సిఐ ఎ కృష్ణ భగవాన్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక శాఖ, దేవాదాయ శాఖ అధికారులు, కూటమి నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, సొసైటీ అధ్యక్షులు పైణ్ణి శ్రీనివాసరావు, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్, సరోజ వాసు, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పల కొండ, ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, అలోక్ చంద్ర జైన్, కంచర్ల సుష్మ మోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భాను వెంకట పద్మ, బాడితిమాని లక్ష్మి, గోనిపాటి బుల్లమ్మ, దేవస్థానం అర్చకులు సన్నిధి రాజు వెంకట రమణ, చెరుకూరి సుందరరామయ్య, సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు...రెండు వారాలుగా దొరకని ఆచూకీ

### - పట్టించుకోని భార్య..తన కుమారుడి ఆచూకీ తెలపాలంటూ కన్నతల్లి ఆవేదన

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఉపాధి నిమిత్తం విశాఖ పట్నంలో ఉంటూ ఇంటికి వచ్చిన కుమారుడు తిరిగి వెళ్లిన క్రమంలో రెండు వారాలుగా కనిపించకుండా పోవడంపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది ఓ తల్లి.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం కొడప గ్రామానికి చెందిన గెద్దం రమేష్(35) ఇంటి నుంచి వైజాగ్ వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి ఏమయ్యాడో తెలియని పరిస్థితి ఉందని తల్లి గెద్దం ధనలక్ష్మి కన్నీరు మున్నీరవుతోంది.. ఈ ఘటనపై తల్లి ధనలక్ష్మి చెప్పిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ తన భార్య సుజాత ఇద్దరూ ఈనెల నాలువ తేదీన వైజాగ్ నుంచి కొమరగిరిపట్నం ఇంటికి రేషన్‌కార్డు తీసుకునే నిమిత్తం వచ్చారని, అయితే అదే రోజు రమేష్ భార్య సుజాత భర్తతో గొడవపడి సాయంత్రం వైజాగ్ తిరిగి వెళ్లిపోయిందని తెలిపింది. మరుసటి రోజు 5వ తేదీన రమేష్ తన భార్య వద్దకు వెళ్లిపోతానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడని తెలిపింది. అయితే ఆరోజు అమలాపురం ఆర్టీసీ బస్ స్టాండ్‌లో రమేష్ టిక్కెట్టు రిజర్వేషన్ చేయించుకుని బస్ ఎక్కలేదని కండక్టర్ తనకు ఫోన్ చేసి తెలిపాడని రమేష్ భార్య సుజాత తనకు ఫోన్ చేసి చెప్పిందని, ఇదిలా ఉంటే అదే రోజు వేరొక వ్యక్తి తనకు ఫోన్ చేసి మీ అబ్బాయి బస్‌స్టాండ్‌లో మద్యం సేవించియున్నాడని, వైజాగ్‌కు వెళ్లేందుకు డబ్బులు లేనందున తనకు ఫోన్‌పే చేస్తే అతనికి ఇస్తానని చెప్పాడని, మా అబ్బాయికి ఒకసారి ఫోన్ ఇవ్వాలని కోరగా అతను ఫోన్ పెట్టేసి మరళా ఎత్తలేదని తల్లి ధనలక్ష్మి వాపోయింది.. అయితే తన కుమారుడు రమేష్ అటు భార్య సుజాత దగ్గరకు వెళ్లక, ఇటు ఇంటికి రాకపోగా కంగారయ్యి అమలాపురం బస్‌స్టాండ్‌లోను, అమలాపురం పరిసర ప్రాంతాల్లోను వెతికించామని, అయినా ఆనాటి నుంచి ఇప్పటికీ తన కుమారుడు ఆచూకీ లభ్యం కాలేదని కన్నీరు మున్నీరవుతోంది.. ఇదిలా ఉంటే తన భర్త గురించి ఇప్పటికీ భార్య సుజాత ఆరా తీయకపోగా తన నుంచి ఎటువంటి బాధ్యత లేనట్లు వ్యవహరిస్తోందని తల్లి ధనలక్ష్మి వాపోయింది. తన కుమారుడి అదృశ్యంపై అమలాపురం పట్టణ పోలీసులకు పిర్యాదు చేశానని, దీనిపై పోలీసులు స్పందించి తన కుమారుడి ఆచూకీ గురించి దర్యాప్తు చేపట్టాలని ఆ తల్లి అభ్యర్థిస్తోంది.

# దివాళీ వైబ్స్.. గులాబీ పువ్వులా ఆకట్టుకుంటున్న సోఫీ చౌదరి!



సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా సెలబ్రిటీల దీపావళి వేడుకకు సంబంధించిన ఫోటోలు దర్శనమిస్తున్నాయి. టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు ప్రతి ఒక్కరూ ఈ దీపావళి వేడుకలను అత్యంత ఘనంగా సంబరంగా జరుపుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్కరు ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే అటు సింగిల్స్ ఇటు ఫ్యామిలీలు ఫోటోలు షేర్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాజాగా గ్లామర్ అందాలతో ఆడియన్స్‌ను కట్టిపడేస్తూ దీపావళి వైబ్స్ అంటూ గులాబీ పువ్వులా.. తన మేనిఛాయతో అందరినీ ఆకట్టుకుంది సోఫీ చౌదరి. సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ఇంస్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే సోఫీ చౌదరి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈ ఫోటోల విషయానికి వస్తే.. సాఫ్ట్ సిల్క్ లైట్ పింక్ కలర్ చీర కట్టుకున్న ఈమె.. అందుకు కాంబినేషన్‌లో స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి అందాలతో మెస్మరైజ్ చేసింది. పోనీటైల్ వేసి పువ్వులు చుట్టి తన మేకోవర్ను ఫుల్ ఫిల్ చేసింది. సింపుల్ జువెలరీతో తన అందాన్ని రెట్టింపు చేసిందని చెప్పవచ్చు.

గులాబీ రంగు చీరలో తన మేనిఛాయను రెట్టింపు చేసుకున్న సోఫీ చౌదరి చిన్నగా స్మైల్ ఇస్తూ ఆ ఫోటోలకు ప్రాణం పోసింది అని చెప్పవచ్చు. ప్రస్తుతం అమ్మడి అందాలు దీపావళి వేళ సరికొత్త కాంతులను నింపుతున్నాయని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోఫి చౌదరి విషయానికి వస్తే.. తన అందంతో నటనతో ఎప్పటికప్పుడు ఆకట్టుకునే ఈమె బాలీవుడ్‌తో పాటూ తెలుగులో కూడా నటించింది.

# రేణూ డెసిషన్ వెనుక రీజనేంటి?



ఒకప్పుడు హీరోయిన్‌గా రాణించిన రేణూ దేశాయ్, పవన్ కళ్యాణ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లలు పుట్టాక ఆయన్నుంచి విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే. పవన్‌తో విడాకుల తర్వాత పూణెలో సెటిల్ అయిన రేణూ, ఎప్పుడూ ఏదొక విషయంతో వార్తల్లో నిలుస్తూనే ఉంటారు. గత కొంత కాలంగా యాక్టింగ్‌కు దూరంగా ఉంటూ వస్తున్న రేణూ, మొన్నా మధ్య రవితేజ హీరోగా వచ్చిన టైగర్ నాగేశ్వరరావు మూవీలో కనిపించి ఆడియన్స్‌ను అలరించిన విషయం తెలిసిందే.

యాక్టింగ్ అంటే ఇష్టం.. కానీ అదే టార్గెట్ కాదు! టైగర్ నాగేశ్వరరావు చేస్తున్నప్పుడు తనపై ఎన్నో విమర్శలు వచ్చాయని, ఎక్కడ చూసినా తానే కనిపిస్తున్నానని, ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తానని అన్నారు. కానీ టైగర్ నాగేశ్వరరావు వచ్చి రెండేళ్లవుతుంది, అప్పట్నుంచి తాను మళ్లీ స్క్రీన్ పై కనిపించలేదని, గతంలో తనను విమర్శించిన వారెవరూ తనకు క్షమాపణలు చెప్పలేదని, మాట్లాడేవాళ్లు ఎలాగైనా మాట్లాడతారని, అందుకే తాను వాటిని పట్టించుకోనని, యాక్టింగ్‌పై ఉన్న ఇష్టం వల్లే తాను ఆ సినిమా చేశానని, కానీ యాక్టింగే తన టార్గెట్ కాదని, ఒకవేళ యాక్టింగే తన టార్గెట్ అయితే తాను హీరోయిన్ అయనప్పటి నుంచి ఇప్పటి వరకు సినిమాలు చేస్తూనే ఉండేదాన్నని, దాంతో తనకెంతో మంచి పేరు వచ్చుండేదని ఆమె పేర్కొన్నారు. కరోనా టైమ్‌లో నిశ్చితార్థం చేసుకున్న రేణూ పవన్ నుంచి విడిపోయాక రేణూ పిల్లలతోనే ఉంటుంది తప్పించి మరో పెళ్లి చేసుకోలేదు. అందరిలానే తనక్కూడా ఓ తోడు కావాలని భావించిన రేణూ కరోనా టైమ్‌లో ఓ వ్యక్తితో నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. కానీ పవన్ ఫ్యాన్స్ దాటికి తట్టుకోలేక ఆమె తన ఎంగేజ్‌మెంట్‌ను కూడా క్యాన్సిల్ చేసుకున్నానని ఎన్నో సార్లు చెప్పుకొచ్చారు. ఎంగేజ్‌మెంట్‌ను క్యాన్సిల్ చేసుకున్నప్పటికీ తనకు రెండో పెళ్లి ఆలోచన ఉందని రేణూ పలుసార్లు చెప్పారు.

# అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకున్న రష్మిక..!



నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'థామా' సినిమాతో నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆయుష్మాన్ ఖురాన హీరోగా నటించిన ఈ హర్రర్ థ్రిల్లర్ మూవీపై అంచనాలు పెరిగే విధంగా రష్మిక మందన్న గత రెండు వారాలుగా ప్రచారం చేసిన విషయం తెల్సిందే. ఇదే సమయంలో రష్మిక తన రాబోయే సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. కానీ థామా సినిమా ప్రమోషన్ సమయంలో అయినా రష్మిక తన వివాహ నిశ్చితార్థం గురించి ఓపెన్ అవుతుందని అంతా భావించారు. కానీ రష్మిక ఆ ప్రశ్నలు రాకుండానే చాలా జాగ్రత్త పడింది. మీడియా సమావేశంలో ఆ విషయాల గురించి ప్రస్తావించిన సమయంలో మౌనంగా నవ్వుతూ ఉండి పోయింది. దాంతో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండల యొక్క వివాహ నిశ్చితార్థం గురించి ఇంకా క్లారిటీ రాలేదు అని అభిమానులతో పాటు అంతా ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్న విషయం తెల్సిందే. తాజాగా రష్మిక మందన్న ఒక చిట్ చాట్‌లో ప్రేమ విఫలం, ఆ సమయంలో ఇద్దరూ పడే బాధ గురించి మాట్లాడింది. చాలా మంది లవ్ బ్రేకప్ సమయంలో ఎక్కువగా అబ్బాయిలు బాధ పడుతారు, వారే చాలా కాలం పాటు అందులో నుంచి బయటకు రాలేక పోతారు, ఆత్మహత్యలు చేసుకుంటారు, దారుణాలకు వడిగడుతారు అంటూ ప్రచారం ఉంది. పలు సర్వేల్లోనూ అదే విషయం వెల్లడి అయింది. కానీ రష్మిక మాత్రం అందుకు విరుద్ధంగా చెప్పుకొచ్చింది. ప్రేమ విఫలం అయిన సమయంలో అబ్బాయిలు మాత్రమే బాధ పడుతారు అంటూ ఉన్న ప్రచారంను ఆమె కొట్టి పారేసింది. అబ్బాయిలు ఎక్కువగా బాధ పడుతారు అంటే తాను ఒప్పుకోను అంది. అబ్బాయిలకు ఏమాత్రం తగ్గకుండా, వారి రిలేషన్‌షిప్ విషయంలో అమ్మాయిలు కూడా చాలా సీరియస్‌గా ఉంటారని రష్మిక మందన్న తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ... అమ్మాయిలు బాధను వ్యక్తపరిచేందుకు మార్గాలు లేవు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అబ్బాయిలు ప్రేమ విఫలం అయిందంటే గడ్డాలు పెంచుకోవడం, మందు తాగడం చేస్తారు. కానీ అమ్మాయిలు అలా చేయలేరు. పెంచుకోవడానికి గడ్డం ఉండదు, అలాగే మందు తాగి తమ ప్రేమ విఫలం గురించి బయట పడరు అంది. అమ్మాయిలకు తమ ఆవేదన వ్యక్తం చేసుకునేందుకు ఎక్కువ మార్గాలు లేకపోవడం వల్లే అబ్బాయిలకు ఈ విషయంలో ఎక్కువగా సానుభూతి లభిస్తుంది అంటూ రష్మిక మందన్న ఈ విషయంలో అమ్మాయిల తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో రష్మిక చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఆమెకు మద్దతుగా అమ్మాయిలు స్పందిస్తూ ఉంటే, కొందరు అబ్బాయిలు మాత్రం రష్మిక అభిప్రాయంను వ్యతిరేకిస్తున్నారు.

# అజయ్ ఫ్యామిలీ పిక్స్ చూశారా?



సోషల్ మీడియా పుణ్యమా అని సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు కూడా బయటకు వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఏదైనా పండుగ వచ్చిందంటే చాలు సెలబ్రిటీలు తమ కుటుంబంతో గడిపిన మధుర క్షణాలను ఇలా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిన్న దేశవ్యాప్తంగా దీపావళి పండుగ ఘనంగా జరిగింది. సెలబ్రిటీలు కూడా ఒకరికి మించి మరొకరు చాలా గ్రాండ్గా తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే తెరకే పరిమితమైన చాలామంది సెలబ్రిటీలు ఇప్పుడు కుటుంబాలను కూడా సోషల్ మీడియా ద్వారా అభిమానులకు పరిచయం చేస్తున్నారు. అలాంటి వారిలో ప్రముఖ నటుడు అజయ్ కూడా ఒకరు అని చెప్పాలి. చాలా రిజర్వ్‌గా ఉండే అజయ్ తాజాగా దీపావళి సెలబ్రేషన్స్‌లో భాగంగా తన కుటుంబాన్ని అందరికీ పరిచయం చేశారు. తన భార్య శ్వేత రావురితో పాటూ ఇద్దరు కొడుకులతో కలిసి దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అందుకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అజయ్ ఫ్యామిలీ చాలా క్యూట్‌గా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. మరి కొంతమంది అజయ్‌కి ఇంత పెద్ద కొడుకులు ఉన్నారా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అటు అజయ్ భార్య కూడా హీరోయిన్స్ కి ఏమాత్రం తక్కువ కాదని.. తన అందంతో ఆమె అందర్నీ కట్టిపడేస్తోందని కూడా కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ఇకపోతే అజయ్ పెద్ద కొడుకును చూస్తే మాత్రం సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు.. మంచి హీరో కటౌట్ అంటూ కూడా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యూట్ ఫ్యామిలీకి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అజయ్ కెరియర్ విషయానికి వస్తే.. విజయవాడలో జన్మించిన ఈయన తండ్రి ఉద్యోగరీత్యా నెల్లూరు, తిరుపతి లకు బదిలీ కావడంతో తన విద్యాభ్యాసాన్ని ఆ ప్రాంతాలలోనే పూర్తి చేశారు. 1995లో ఎంసెట్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం హైదరాబాదు జూబ్లీహిల్స్‌లోని ఒక కాలేజీలో చేరాడు. అక్కడే నటన మీద ఆసక్తితో మధు ఫిలిం ఇన్స్టిట్యూట్లో చేరి నటనలో శిక్షణ కూడా తీసుకున్నారు. అజయ్ ఇండస్ట్రీలోకి రావాలన్న కోరికను తన తండ్రికి చెప్పడంతో ఆయన కూడా కాదనలేక కొడుకును ఈ దిశగా ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే అజయ్ తండ్రికి దర్శకుడు వేమూరి జ్యోతి కుమార్ పరిచయం ఉండడంతో కౌరవుడు అనే సినిమాలో అవకాశం కల్పించారు. తొలి సినిమాలో అయితే తండ్రి పలుకుబడితో అవకాశం వచ్చింది కానీ ఆ తర్వాత అవకాశాల కోసం దాదాపు 9 నెలలు ఎదురు చూశారట. చివరికి శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి సహకారంతో ఖుషీ సినిమా నటీనటుల సెలెక్షన్స్‌లో ఎంపికయ్యారు. అందులో ఆకతాయి పాత్ర ఈయనకు మంచి గుర్తింపును అందించింది. ఆ తర్వాత ఒక్కడు సినిమా ఈయనకు ఊహించని పాపులారిటీ సాధించి పెట్టింది. ఎమ్మెస్ రాజు, రాజమౌళి వంటి దిగ్గజ దర్శకులు ఈయనకు అవకాశాలు ఇచ్చి ప్రోత్సహించారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మహేష్ బాబు నటించి బ్లాక్ బస్టర్స్ అందుకున్న ఒక్కడు, అతడు, పోకిరి చిత్రాలలో అజయ్ నటించడం విశేషం.

# వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెజిస్ట్రేట్ : ఏ విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం పట్టణంలో గల బి.సి బాలుర, బాలికల వసతి గృహాలను, అదేవిధంగా బాలల సదనం వసతి గ్రహాన్ని కూడా స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ .విజయ్ రాజ్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు.అలాగే విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకుని, మెనూ అమలు చేస్తున్నది? లేనిది?, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను కూడా తనిఖీ చేశారు. వసతి గృహాల వార్డెన్‌లకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

# జీఎస్టీ 2.0 తో దేశవ్యాప్తంగా ధరలు తగ్గింపు - ప్రజలకు మేలు నిత్యావసరాల ధరల తగ్గింపు వల్ల కుటుంబానికి రూ.2 వేల వరకు ఆదా : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**- వ్యవసాయ, రవాణా రంగాలకు ఊతం - డయాబెటిక్ మందులపై జీఎస్టీ రద్దు - ప్రజా ఆరోగ్యంపై దృష్టి - వాహనాల ధరలు రూ.2 లక్షల వరకు తగ్గిన వాస్తవిక లాభాలు - ఆంధ్రప్రదేశ్‌లో అవగాహన కార్యక్రమాలకు ప్రజల విశేష స్పందన**



**డక్కిలి, (రాజధాని వార్తలు):** దేశవ్యాప్తంగా అమలవుతున్న జీఎస్టీ 2.0 సంస్కరణలు సామాన్య ప్రజలకు నేరుగా లాభాలను అందజేస్తున్నాయని, ముఖ్యంగా నిత్యావసరాల ధరలు గణనీయంగా తగ్గడం వల్ల ప్రతి కుటుంబానికి రూ.2 వేల వరకు ఆదా అవుతోందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. డక్కిలిలో జీఎస్టీ విస్తృత అవగాహన ర్యాలీని చేపట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ క్షేత్రస్థాయిలో కలిగిస్తున్న ప్రత్యక్ష లాభాలను వివరించారు. “పేద, మధ్యతరగతి వారి జీవిత నాణ్యతను మెరుగుపర్చే దిశగా జీఎస్టీ 2.0 కీలకంగా మారింది. అవసరమైన వస్తువులపై పన్నులు తగ్గించడమే కాక, ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఔషధాలపై పూర్తిగా జీఎస్టీ తొలగించబడటం చాలా సానుకూల పరిణామం” అని ఎమ్మెల్యే రామకృష్ణ వివరించారు. వ్యవసాయం – రవాణా రంగాల్లో గణనీయ ప్రయోజనాలు రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, పరికరాలపై పన్ను రేటు 18% నుంచి 5% కు తగ్గించడంతో, ఒక్కో ట్రాక్టర్ ధర సుమారుగా రూ.40 వేల వరకు తగ్గిందని ఎమ్మెల్యే వెల్లడించారు. వాహన రంగంలోనూ స్కూటర్లు, బైకులు, కార్లు వంటి వాటిపై రూ.8 వేల నుంచి రూ.2 లక్షల వరకు ధరలు తగ్గినట్లు పేర్కొన్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలపై జీఎస్టీ తగ్గింపుతో, సామాన్యుల కొనుగోలు శక్తికి అనుగుణంగా వస్తువులు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. కొబ్బరి నూనె, సబ్బులు, బ్రష్‌లు వంటి నిత్యవసరాలపై పన్ను రేటు 18% నుంచి 5%కి తగ్గించబడిందని వివరించారు. జీఎస్టీ వల్ల ఆరోగ్య పరిరక్షణకు ఊతం డయాబెటిక్ మందులపై జీఎస్టీ పూర్తిగా తొలగించడంతో, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి గణనీయ ఊరటనిస్తోందని చెప్పారు. అనంతరం ఆయన డక్కిలి సచివాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం డక్కిలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటాద్రి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారని తెలుసుకున్న ఎమ్మెల్యే రామకృష్ణ వారి నివాసానికి వెళ్లి వెంకటాద్రిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కలి చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

# లెప్రసీ కాలనీలో దివ్యాంగులకు బెడ్ షీట్స్ ఫ్రూట్స్ పంపిణీ చేసిన కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు లెప్రసీ కాలనీలో కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో బిసిఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు.. దివ్యాంగులకు బెడ్ షీట్స్, పండ్లు పంపిణీ చేశారు. సమాజ సేవలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో కళాశాల యజమాన్యం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు సహకారం అందించిన కళాశాల డీన్ సుధారాణికి, ప్రిన్సిపాల్ నాగయ్యకి, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు షావలికి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు.






# వైకాపా వెంకటగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా గానుగ అభిరామ్

**డక్కిలి, (రాజధాని వార్తలు):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియో జకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా డక్కిలి మండలం నరసనాయుడు పల్లి గ్రామానికి చెందిన గానుగ వెంకట బాబు, (అభిరామ్)ను నియమించారు. ఈ సందర్భంగా గానుగ అభిరామ్ తనపై నమ్మకంతో వెంకటగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా డక్కిలి వైకాపా మండల నాయకుల సహకారంతో పార్టీ కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

# జడ్పీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతినెల మూడో శనివారం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈఓ గౌరవనీయులు జే మోహన్‌రావు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ విజయ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు తర్వాత జిల్లా పరిషత్ కార్యాలయంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ ఆర్డబ్ల్యూఎస్ విజయ భాస్కర్ రావు, జిల్లా పరిషత్ పరిపాలన అధికారులు, జడ్పీ సిబ్బంది ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులు






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మరియు మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు శుక్రవారం జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, మండల జట్లకు ఎంపికయ్యారు.
మధుపాడ సాయి గౌతమి హై స్కూల్ మైదానంలో నిర్వహించిన అండర్ 14, అండర్ 17 విభాగాలకు సంబంధించి వివిధ క్రీడా పోటీలు అనంతరం ఎంపికలు చేప ట్టారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను మండలస్థాయి జట్లకు ఎంపిక చేశారు. ఈ ఎంపికైన క్రీడాకారు లను శనివారం పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ .రమేష్ కుమార్, నాగమణి అభినందించారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు టి. శ్రీనివాసరావు, ఎల్. కృష్ణవేణి, మరుపల్లి హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు ఓ.పార్వతి, విష్ణు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం : ఎం.పీ.డీ.వో బి.కళ్యాణి



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని ఎంపీడీవో బి.కళ్యాణి అన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి మెంటాడ రోడ్డు వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. అలాగే పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తద్వారా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో ఎంఈఓ – 2 సాయి చక్రధర్, ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# సైకిల్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా












**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం రోజు చేపట్టిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం క్లీన్ ఎయిర్ థీమ్ తోటి నెల్లూరు నగరంలోని బట్వాడి పాలెం నుంచి సారాయిన అంగడి సెంటర్ మరియు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీని నిర్వహించారు. సైకిల్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జీవితంలో స్వచ్ఛమైన గాలి చాలా ముఖ్యమైనది అని అందువల్ల ఆక్సిజన్ నాణ్యతను బాగుండాలి అని అన్నారు. ముఖ్యంగా నగర పరిధిలో క్లీన్ ఏయిర్ చాలా ముఖ్యమైందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈరోజు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో మరియు జిల్లా ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో ఆటోలు ,కార్లు ,బస్సులు ఎక్కువ ఉన్నాయని పర్యావరణానికి ఉపయోగపడే విధంగా సైకిల్ ర్యాలీని నేడు ప్రమోట్ చేయడం జరిగిందన్నారు. ఇందులో దాదాపుగా 300 మంది పైచిలుకు పాల్గొన్నారు అన్నారు. అదేవిధంగా మొక్కలు నాటుట వల్ల కార్బన్ డయాక్సైడ్ మరియు కార్బన్ మోనాక్సైడ్ వంటి వాటిని నిలువరించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని తదనుగుణంగా ర్యాలీ అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు.
మంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులు అనుగుణంగా జిల్లాలోని ప్రతి ఒక్కరూ చెట్లు నాటి ఆక్సిజన్ నాణ్యతను పెంచే విధంగా అందరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నగర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలందరూ దీపావళి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని అదేవి ధంగా తగు రక్షణ మరియు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, వివిధ శాఖల అధికారులు తడితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక అనుమతుల గడువు ముగిసిన తరువాత సురక్షితమైన గోడౌన్లలోనే భద్రపర్చాలి

**- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ - అగ్ని ప్రమాదాల నియంత్రణకు షాపు యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్న జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపీఎస్ - షాపుల వద్ద సమృద్ధిగా నీరు, పొడి ఇసుక, అగ్ని నియంత్రిక పరికరాలు అందుబాటులో ఉంచాలన్న జిల్లా ఎస్పీ - నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** దీపావళి పండుగ సందర్భంగా విజయనగరం పట్టణం కే.ఎల్.పురం శివార్లలో ఏర్పాటు చేసిన బాణసంచా విక్రయించే షాపులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ అక్టోబరు 18న ఆకస్మికంగా సందర్శించి, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని, ప్రమాదాల నియంత్రణకు బాణసంచా విక్రయదారులకు పలు భద్రతపరమైన సూచనలు చేసారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ - బాణసంచా విక్రయాలు చేపట్టేందుకు తాత్కాలిక అనుమతులు పొందిన వ్యాపారులు గడువు ముగిసిన తరువాత బాణసంచా విక్రయాలను నిలిపివేయాలని, విక్రయాలు కాకుండా మిగిలిపోయిన బాణసంచాను సురక్షితమైన గోడౌన్లలోనే భద్రపర్చుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలు చేపట్టే షాపుల మధ్య తప్పనిసరిగా 15 మీటర్ల నిర్దిష్ట దూరం ఉండాలన్నారు. షాపుల వద్ద ప్రమాదాల నియంత్రణకు ఇసుక బస్తాలు, నీటి టబ్బులు, ఫైర్ నియంత్రికలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. షాపుల వద్ద ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండి ఒకేసారి కొనుగోలు చేయకుండా చూసుకోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న వస్తువులు, దగ్గరలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలు, హెచ్చరికలతో కూడిన బోర్డులను, ఫ్లెక్సీలను తాత్కాలిక షాపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. మనుష్యులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచాను రవాణ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండే మెటీరియల్తో అనగా ఆస్బెస్టాస్, జి.ఎస్. రేకులతో మాత్రమే తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలు, నిల్వలు ఉంచే షాపులు, గోడౌన్లు వద్ద వెలుగు ఉండే విధంగాను, లోపలకు వెళ్ళేందుకు, బయటకు వచ్చేందుకు వేర్వేరు ద్వారాలు ఉండే విధంగా చూడాలన్నారు. గోడౌన్లలో సురక్షితమైన వైరింగు, ఫైర్ అలారమ్స్ ఉండే విధంగా షాపు యజమానులు చర్యలు చేపట్టే విధంగా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. షాపు యజమానులు బాణసంచా విక్రయించే షాపులు, నిల్వ ఉండే గోడౌన్లు, తాత్కాలిక షాపుల వద్ద ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ అన్నింటిని తప్పని సరిగా పాటించాలని, లైసెన్సులో అధికారులు సూచించిన సమయం వరకు మాత్రమే విక్రయాలు నిర్వహించే విధంగా చూడాలన్నారు. బాణసంచా వ్యాపారుల తాత్కాలిక లైసెన్సుల గడువు ముగిసిన తరువాత మిగిలిన బాణసంచాను నిబంధనలకు అనుగుణంగా రూపొందించిన గోడౌన్లోనే భద్రపర్చుకోవాలని, జనావాసాల్లోను, ఇండ్లలోను భద్రపర్చవద్దన్నారు.

నిబంధనలు, భద్రత ప్రమాణాలను అతిక్రమించిన వారిపైన, జనావాసాల్లో బాణసంచాను భద్రపర్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని వ్యాపారులను జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక అధికారులు సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బాణసంచా కొనుగోలు చేసేం దుకు వచ్చే వాహనదారుల వాహనాలను ఇతర వాహనాలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగు చేసే విధంగా చూడాలని, ప్రధాన రహదారిపై వెళ్ళే వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం కలగకుండా ట్రాఫిక్ రెగ్యులేషను చేపట్టాలని ట్రాఫిక్ సిఐను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్. గోవిందరావు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, వన్ టౌన్ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, టూ టౌన్ సిఐ టి.శ్రీనివా సరావు, ట్రాఫిక్ సిఐ సూరినాయుడు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం ఉప కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీ

**- సదుపాయాల మెరుగుదలకు తక్షణ చర్యలు**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం సబ్ కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి గత కొన్ని వారాలుగా విద్యా రంగాన్ని బలోపేతం చేసే కృషిలో భాగంగా భద్రాచలం ఉప కలెక్టర్ భద్రాచలం కేంద్రంలో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గిరిజన సంక్షేమ రేసిడెన్షియల్ స్కూల్ (పిల్లలు), కే జీ బీ వీ భద్రాచలం., డిగ్రీ కాలేజీ (భద్రాచలం), ఎస్సీ & బీసీ బాలుర వసతిగృహం (భద్రాచలం), జెడ్పిహెచ్ఎస్ (గర్ల్స్) భద్రాచలం, కేజీబీవీ బూర్గం పాడు, ఏహెచ్ఎస్ రేసిడెన్షియల్ స్కూల్ (బాయ్స్) - గోంధిగూడెం (అశ్వాపురం మండలం) మరియు ఏహెచ్ఎస్ రేసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్) - ఎల్ సి రెడ్డి పల్లి (పినపాక మండలం) వంటి పలు విద్యాసంస్థలను ఆకస్మికంగా పరిశీలించారు. భద్రాచలం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సందర్శనలో ఐ ఐ టి-జేఈఈ మరియు నీట్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అదనపు రిఫరెన్స్ పుస్తకాలు మరియు అధ్యయన సామగ్రి కోసం అభ్యర్థించారు. దానికి డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ వెంటనే చర్యలు తీసుకొని అవసరమైన వనరులు అందజేసింది. అలాగే గిరిజన సంక్షేమ రేసిడెన్షియల్ స్కూల్ (గర్ల్స్), భద్రాచలం మరియు జెడ్పిహెచ్ఎస్ (గర్ల్స్), భద్రాచలంలో విద్యార్థినిల కోరిక మేరకు ఫ్యాన్లు మరియు ట్యూబ్ లైట్లు ఏర్పాటు సంబంధిత అభ్యర్థనలు కూడా వెంటనే పరిష్కరించబడ్డాయి, తద్వారా విద్యార్థులకు అనుకూలమైన పాఠశాల వాతావరణం కల్పించబడింది.ప్రతి పాఠశాల పర్యటనలో ఉప కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, వంటశాల, వసతి గృహాలు, త్రాగు నీటి సదుపాయాలు మరియు మరుగుదొడ్లను పరిశీలించారు. డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల విద్యా ప్రగతికి అనుకూలమైన వాతావరణం సృష్టించడం, అవసరమైన అకడమిక్ వనరులు అందించడం ద్వారా విద్యా నాణ్యతను పెంపొందించేందుకు తన వంతు సహకారం అందిస్తున్నారు.

# భద్రాచలంలో బీసీ రిజర్వేషన్ల కోసం బంద్ విజయవంతం : బీజేపీ





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం పట్టణంలో బీసీ ఐక్యవేదిక పిలుపుతో జరిగిన రాష్ట్ర బంద్లో భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కుంజా ధర్మారావు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ఉద్దేశమే లేదని అన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పారదర్శకంగా, ట్రిపుల్ టెస్ట్ ప్రమాణాల ప్రకారం ఇవ్వాలని నిపుణులు సూచించినా ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా జీవోల పేరుతో కాలయాపన చేస్తోందని చెప్పారు. ప్రభుత్వమే తన అనుచరుల ద్వారా కేసులు వేసి హైకోర్టు నిర్ణయాలను నిలిపివేయించుకుని, ఇప్పుడు న్యాయస్థానాల పేరుతో తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని కుంజా ధర్మా రావు విమర్శించారు.

ఇప్పటికైనా ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు కళ్ళు తెరచి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల విషయంలో పాటిస్తున్న ద్వంద్వ విధానాలను ప్రజా పోరాటంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీసీ సమాజం ఐక్యంగా ముందుకు వచ్చి ప్రభుత్వ నిర్లక్ష్యానికి బుద్ధి చెప్పినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నిడదవోలు నాగబాబు, సీనియర్ నాయకులు ఆవుల సుబ్బారావు, ములిశెట్టి రామ్మోహన్ రావు, పీసీ కేశవ్, బోడ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన వెంకన్న, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ములిశెట్టి నిఖిల్, జిల్లా కార్యదర్శి అన్నెం హరీష్, మండల ఉపాధ్యక్షులు అల్లాడి వెంకట సుబ్బారావు, ముత్యాల చంద్రశేఖర్, దురుసోజు పాండురంగ చారి, రామాచారి, కనసాని శ్రీనివాస్, గార్లపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్యభద్రతకు అత్యధిక ప్రాధాన్యత : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**- 111 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 85.50 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసిన మంత్రి ఆనం**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ, వారికి అన్నివిధాల ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 111 మంది బాధిత కుటుంబ లబ్ధిదారులకు సుమారు రూ. 85.50 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఆయా మండలాల కన్వీనర్లతో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఏ ఒక్కరూ కూడా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే 175 నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

**మున్సిపల్ కార్మికులకు కిట్లు పంపిణీ**

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్మికులకు రెండు జతల దుస్తులు, సామగ్రి గల కిట్లను మంత్రి ఆనం పంపిణీ చేశారు. 125 మంది మున్సిపల్ వర్కర్లకు ఆరు లక్షల విలువైన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణమ్మ, ఆర్డీవో పావని, కమిషనర్ గంగా ప్రసాద్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు అండగా స్వాన్ స్వచ్ఛంధ సేవా సంస్థ





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ, నిత్యం నరకం అనుభవిస్తూ, పేదరికంతో అరకొరగా వైద్య సేవలు పొందుతూ రోజు గడవడమే ధైన్యంగా మారిన అనేక మంది నిరుపేద క్యాన్సర్ బాధితులకు అండగా నిలుస్తోంది స్వాన్ స్వచ్ఛంధ సేవా సంస్థ. క్యాన్సర్తో బాధపడుతూ చికిత్స పొందుతున్న రోగులకు ప్రతీ నెల ఆర్థిక సాయంతో పాటూ నిత్యావసర సరుకులను అందిస్తోంది

స్వాన్ సంస్థ. తాజాగా ఆదివారం నాడు స్వాన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నీలకంఠం భానుతేజ రెడ్డి క్యాన్సర్ తో బాధపడుతున్న ఓ మహిళకు సాయం అందజేశారు. నెల్లూరు నోవా బ్లడ్ బ్యాంక్లో జరిగిన కార్యక్రమంలో పడారు పల్లికి చెందిన క్యాన్సర్ రోగి సుశీలమ్మకు 4 వేల రూపాయల ఆర్థిక సాయంతో పాటూ రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను నీలకంఠం భానుతేజ రెడ్డి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శివాజీ యూత్ ఫౌండేషన్ ఛైర్మెన్ మోపూరు భాస్కర్ నాయుడు హాజరయ్యి స్వాన్ స్వచ్ఛంధ సేవా సంస్థ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వాన్ సంస్థ అధ్యక్షులు నీలకంఠం భానుతేజ రెడ్డి మాట్లాడుతూ రక్తదాత, నెల్లూరు నగర ట్రాఫిక్ విభాగం ఇన్ స్పెక్టర్ కాకర్ల రామకృష్ణ కుమారుడు కాకర్ల హర్షిత్ నరసింహా పుట్టిన రోజు సందర్భంగా క్యాన్సర్ బాధితురాలికి కొంత సాయం చేశారని, మిగిలినది తాము సమకూర్చామన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడే నిరుపేదలకు స్వాన్ సంస్థ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం శివాజీ యూత్ ఫౌండేషన్ ఛైర్మెన్ మోపూరు భాస్కర్ నాయుడు మాట్లాడుతూ స్వాన్ స్వచ్ఛంధ సేవా సంస్థ ఎన్నో ఏళ్లుగా క్యాన్సర్ బాధితులకు అండగా నిలవడం సంతోషకరమని అన్నారు. స్వాన్ సంస్థకు చేయూతగా నిలుస్తున్న బ్రహ్మాస్ ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గాలాజు నాగమణిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, జన, గిరి, షణ్ము, మదన్, అమర్ పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ ci.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699




# పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా సృజనాత్మక చిత్రాలు... సోమాపద్మారత్నం


**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు పండిట్ ప్రముఖ చిత్రకారుడు సోమా పద్మారత్నం అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా సృజనాత్మక చిత్రాలను అద్భుతంగా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏటా అక్టోబరు 21న పోలీసు సంస్కరణ దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద నిర్వహించే ప్రధాన కార్యక్రమంలో పోలీసు అమరులకు నివాళి అర్పిస్తారు ఇందులో భాగంగా ఢిల్లీ పోలీసులతో పాటు సి ఏపి ఎఫ్ సిబ్బంది ఉమ్మడి కవాతు చేస్తారు అని తెలిపారు.

# బలిజ వారి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పునర్ నిర్మాణానికి నిర్ణయం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నవాబుపేటలో ఉన్న పురాతన బలిజవారి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం పునర్ నిర్మాణానికి దేవస్థాన కమిటి ఆమోద ముద్ర వేసింది. దీనిపై ఆలయ ఛైర్మెన్ కొండేటి లక్ష్మీ నరసింహారావు కమిటి సభ్యులు, అర్చకులతో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పురాతనమైన అమ్మవారి దేవస్థానాన్ని ఆధునీకరించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. దేవస్థానాన్ని పునర్ నిర్మించాలని సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం అనంతరం ఆలయ ఛైర్మెన్ కొండేటి లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ నెల్లూరు నవాబుపేటలో ఎంతో పురాతనమైన బలిజ వారి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాన్ని భవిష్యత్ తరానికి అందుబాటులో ఉంచాలన్న సంకల్పంతో ఆలయాన్ని పునర్ నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అమ్మ దయతో ఆలయం శరవేగంగా పునర్ నిర్మాణం అవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆలయ కమిటి కార్యదర్శి మణి, కోశాధికారి యంత్రపాటి వెంకటేశ్వర్లు, ఇతర కమిటి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# చీటీల నిర్వాహకుడి ఘరానా మోసం...!

## - ఊరు విడిచి పరారైన వ్యక్తి - పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

**పెద్దాపురం, నెల్లూరు, (రాజధాని వార్తలు):** చీటీల పేరుతో గ్రామాల్లోని పలువురి వద్ద నుంచి సుమారు రూ. 2 కోట్లమేర సొమ్ము వసూళ్లకు ఆపై గ్రామాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన ఘరానా మోస గాడి ఉదాంతం శనివారం వెలుగులోనికి వచ్చింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామానికి చెందిన ఎలుబండి చక్రపాణి అనే వ్యక్తి అనేక కుటుంబాల వద్ద నుంచి చీటీల పేరుతో తన సొమ్ము కాజేసి ఊరు విడిచిపెట్టి ఏలేశ్వరం పట్టణానికి మకాం మార్చినందున అతని వద్ద నుంచి తమ సొమ్ము రికవరీ చేయాలని కోరుతూ బాధిత ప్రజలు పెద్దాపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ ఆర్థిక అవసరాలు తీరుతాయనే ఆశతో చక్రపాణి అనే ఆసామి వద్ద నెలవారి చీట్లు వేయగా సుమారు రెండు కోట్ల రూపాయలతో అతను పరారైనట్టు తెలిపారు. కష్టార్జితంలో రూపాయి రూపాయి కూడగట్టి చీట్లు వేసుకోగా చక్రపాణి మోసంతో తామంతా అయోమయానికి



గురయ్యా మని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చక్రపాణి కి గ్రామంలో సొంత ఇల్లు, పొలం ఉన్నందున అతనిని రప్పించి వాటి ద్వారా తమ సొమ్మును రికవరీ చేయించి తమకు న్యాయం జరిగించాలని బాధిత ప్రజలు ఎస్పై మౌనికను కోరుతూ సుమారు 100 సంతకాలతో ఫిర్యాదును అందజేశారు. ఈ ఆందోళనలో బాధిత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కూటమి ప్రభుత్వం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఇది ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహమేనని ఎమ్మెల్సీ కుడి పూడి సూర్యనారాయణ రావు అన్నారు. అమలాపురం రూరల్ మండలం గున్నేపల్లి అగ్రహారంలో వైస్సార్సీపీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి ఆధ్వర్యంలో శనివారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో వైస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలన్న ఆలోచన కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని అన్నారు. అమలాపురం అసంబ్లీ వైఎస్ఆర్సిపి కో-ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ పేదలకు విద్య, వైద్యం ఉచితంగా ప్రభుత్వం అందించవలసి ఉందని అయినప్పటికీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దురదృ



ష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్య లక్ష్మి, జడ్పీటిసి పందిరి శ్రీహరి, నాయకులు కుడిపూడి బాబు, నాగబత్తుల కొండ, పాలమూరు బాలకృష్ణ, మూలపర్తి సత్య నారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్ రావు, గుత్తుల జానకి లక్ష్మి మురుగులరాజు, మద్దింశెట్టి ప్రసాద్, కేతా నరసింహ మూర్తి, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan